క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాలు, పట్టణాల్లో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం పట్టణం జగ్గయ్య చెరువుకాలనీలో అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు సూర్యావతి దంపతులు నిర్మించిన రామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని రామాంజనేయ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, న్యాయవాది నాళం నారాయణరావు, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు బొజ్జా మాణిక్యాలరావు, పాదగయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొజ్జా దొరబాబు, పార్టీ నేతలు పచ్చిమళ్ల అప్పలరాజు, కొత్తపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బండి రవి, కడాల పోశయ్య, చింతాడ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ జనరల్ ఒకటి, బీసీ–డి జనరల్ ఒకటి ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పదో తరగతి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన దడాల ఈశ్వరరావు (35) తన భార్యతో ఘర్షణ పడి ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కె దుర్గాప్రసాద్ హెచ్చరించారు. గురువారం రాత్రి పవర గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలను ప్రలోభ పెట్టి మోసగాళ్ల సంఖ్య పెరిగిపోయిందన్నారు. గ్రామాల్లో జూదం, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వీరంరెడ్డి ఆనంద్, నాగనబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలకు టాప్ ప్లేస్‌మెంట్ అవార్డు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు టాప్ ప్లేస్‌మెంట్ అవార్డు లభించినట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎస్. సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇటీవల అడ్వాన్సింగ్ అకాడమీ–ఇండస్ట్రీ కొలాబిరేషన్ సదస్సు నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను జరిగిన ప్రాంగణ నియామకాల్లో రాష్ట్ర స్థాయిలో 170 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొనగా ఆదిత్య కళాశాలకు ఈ అవార్డు దక్కినట్టు వివరించారు. ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి. నాగరాణి చేతుల మీదుగా ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ అవార్డును అందుకున్నారని చెప్పారు.



రాపర్తిలో దుర్గాదేవి అమ్మవారికి శాకంబరి అలంకరణ



ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు



పాదగయ క్షేత్రంలో కాళికాదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారు



స్కంద మాతగా తాటిపర్తి అపర్ణాదేవి



భువనేశ్వరి పీఠంలో మహాచండీ దేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు

కాళికాదేవిగా జగన్మాత



కొమరగిరిలో లలితాదేవిగా అమ్మవారు



పిఠాపురం మండలం రాపర్తిలో బోనాల ఉత్సవం

పిఠాపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు కాళికా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా పూరూహూతికా అమ్మవారు ప్రత్యేక ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసియున్న అపర్ణాదేవి అమ్మవారు ఐదో రోజు డ్రై ఫ్రూట్స్‌తో స్కంద మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాడ శివాలయంలో లలితాదేవి ప్రత్యేక అంలకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా బోనాల సంబరం

పిఠాపురం: మండలంలోని రాపర్తిలో వేంచేసిన దుర్గా మల్లేశ్వరి అమ్మవారికి గురువారం 150 మంది ముత్తైదువులతో బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు శిరస్సున బోనాలు ధరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారి మహాచండీ దేవి అవతారం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు గురువారం సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ కార్యనిర్వహణాధికారులు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను సరస్వతి అవతారంలో అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు

మహాచండీ అవతారంలో భువనేశ్వరి అమ్మవారు

స్థానిక వర్తుల వారి వీధిలో ఉన్న శ్రీభువనేశ్వరి పీఠంలో గురువారం భువనేశ్వరి అమ్మవారు మహాచండీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మండపారాధన, అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం మంత్రపుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేట బ్రాహ్మణ సంఘ కల్యాణ మండపంలో గురువారం సామూహిక సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా దేవీనవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొమరగిరిలోని కనకదుర్గమ్మ లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రూ. 5.70 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో వివిధ అనారోగ్యాలకు గురైన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5.70 లక్షల చెక్కులను గురువారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఆర్‌బీ పట్నానికి చెందిన సరికొండ వెంకట్రావుకు రూ.60 వేలు, సామర్లకోటకు చెందిన మన్యం రామకృష్ణకు రూ.28 వేలు, వడ్లమూరుకు చెందిన కంటే కుమారికి రూ.16 వేలు, దివిలికి చెందిన ఇంటి వీరబాబుకు రూ.78 వేలు, సాంబారపు సత్యవేణికి రూ.70 వేలు, జి.మేడపాడుకు చెందిన కోనా లోవలక్ష్మికి రూ.60 వేలు, వీకే రాయపురానికి చెందిన యండగుండి రాజుకు రూ.26 వేలు, పవరకు చెందిన జల్లిగంపల పార్వతికి రూ.34 వేలు, పెద్దాపురానికి చెందిన తానారి సోమరాజుకు రూ.18 వేలు, లింగంపల్లి వరలక్ష్మికి రూ.32వేలు, కట్టమూరుకు చెందిన జోగి నరసింహులుకు రూ.38 వేలు, జి.మేడపాడుకు చెందిన బేబీ మున్నమ్మదేవికి రూ.26 వేలు, కట్టమూరుకు చెందిన పల్లా పద్మారావుకు రూ.20 వేలు, మర్లావకు చెందిన లావేటి దుర్గాప్రసాద్‌కు రూ.38 వేలు, సామర్లకోటకు చెందిన దూది రాజుబాబుకు రూ.26 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మందపాక సురేష్, గోపు మురళి, గోలి బాబ్జి, పుట్టా బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం



రమణక్కపేటలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



సభలో ప్రసంగిస్తున్న దవులూరి దొరబాబు

• ఎమ్మెల్యే పెండెం దొరబాబు
• పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం అందిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని రమణక్కపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. మీకు ఇంకా ఏమైనా అవసరమైన సేవలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సౌజన్య పర్యవేక్షణలో డాక్టర్లు 537 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. గతంలో వైద పరీక్షలు చేయించుకోవాలంటే ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఊరులోనే ప్రజలు స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, స్థానిక నాయకులు బాబీ, నేరేళ్ల రెడ్డి, సతీష్‌రెడ్డి, పాపిరెడ్డి, ఎంపీడీఓ పి.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడపట్టి వారి గడపవద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో సర్పంచ్ ఆకుల వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి దొరబాబు మాట్లాడతూ దేశంలోన ఎక్కడా లేనట్టుగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీయే అన్నారు. వారికి తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు దశల్లో అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలందిస్తారని చెప్పారు. తొలుత దొరబాబు రిబ్బన్ కట్ చేసి వైద్య సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీదేవి, సర్పంచ్‌లు కనపర్తి సీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి, ఆకుల వీరబాబు, పార్టీ నాయకులు దూది రాజు, గల్లా వీరబాబు, పల్ల గంగారావు, బర్రే రామగోవిందు, కామన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలోనే నూతన అధ్యాయం

సామర్లకోట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో దేశ చరిత్రలోనే నూతన అధ్యాయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని అన్నవరం దేవస్థాన ప్రత్యేకాహ్వానితులు మోరంపూడి శ్రీరంగ నాయకులు అన్నారు. ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో భాగంగా జి.మేడపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయాల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే హెల్త్ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఇంటింటా సర్వే చేయించినట్టు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సర్పంచ్ పటాని దేవి, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ, వివిధ విభాగాల సిబ్బంది రోగులకు సేవలందించారు. గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. డాక్టరు ప్రశాంత్, శ్రీహిమవతి వైద్య పరీక్షలు చేశారు. 560 మందిని పరీక్షించి, మందులు అందజేసినట్టు వారు తెలిపారు.



జి.మేడపాడులో రోగులకు మందుల కిట్లు అందజేసిన డాక్టరు ప్రశాంత్, రంగనాయకులు

కొబ్బరి ఫలసాయానికి వేలం

సామర్లకోట: గణపతినగరంలోని వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయాన్ని తీసుకోవడానికి, గడ్డి కోసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 11.30కు మున్సిపల్ కార్యాలయంలో ఈ వేలం జరుగుతుందని చెప్పారు. పాటదారులు రూ.20 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

• ఎమ్మెల్యే పెండెం దొరబాబు
• కొమరగిరిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొమరగిరిలో గురువారం ఆయన గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల రూపంలో గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే రామాలయం, అంగన్‌వాడీ భవనం ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి తమ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి కుంటి పడిందన్నారు. ప్రజలు రోడ్లు, డ్రైన్ల విషయంలో ఇబ్బందులు పడకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి, స్థానిక నాయకులు మేడే రామకృష్ణారెడ్డి, చింతపల్లి సత్తిరెడ్డి, దాసరి పెదకాపు, కఠారి చంటిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నరుకుర్తి వెంకటలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.



కొమరగిరిలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

చెస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి మెరుగు

• ఓఎన్‌జీసీ జీఎం రవి
• ముగిసిన సౌత్‌జోన్ చెస్ పోటీలు

పెద్దాపురం: విద్యార్థుల్లో మేధోశక్తి మెరుగుపడడానికి చెస్ క్రీడ దోహదం చేస్తుందని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం జనరల్ మేనేజర్ లంకా రవి అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీబీఎస్‌ఈ సౌత్ జోన్ చెస్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సభకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. జీఎం రవి మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా పెద్దాపురం శ్రీ ప్రకాష్‌లో సౌత్ జోన్ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్ పట్ల ఆసక్తి పెరిగేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఏపీ చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ శర్మ మాట్లాడుతూ గతేడాది ఈ పోటీలు తమిళనాడులో జరిగాయని చెప్పారు. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రముఖ చెస్ క్రీడాకారిణి బొడ్డు ప్రత్యూష.. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో చదవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. చెస్ అసోషియేషన్ కార్యదర్శి భీమారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, చీఫ్ రిఫరీ జీవీ కుమార్, పాఠశాల అకడమిక్, కల్చరల్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం రవి, విజయ్‌ప్రకాష్

'ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి' జయప్రదం చేయండి

• రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

సామర్లకోట: ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి' అనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కోరారు. వలంటీర్లు, గృహ సారథులతో స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటన గొప్ప విజయవంతం కావడానికి సహకరించిన వలంటీర్లు, గృహసారథులకు అభినందనలు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలని కోరుకుంటున్నారో సర్వే చేయాలన్నారు. ఈ మేరకు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటిలో అమలు చేసిన వాటిని ప్రజలకు వివరించి, వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేని తీరును ప్రతి ఇంటికి వివరించాలన్నారు. వలంటీర్లు, గృహసారథులకు ముఖ్యమంత్రి న్యాయం చేస్తారని తెలిపారు. స్థానికుడైన తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోరుకున్నట్టుగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకునేలా నియోజకవర్గంలో పని చేస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో పర్యాయం నిరూపించారని తెలిపారు. అడిగిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కాలేజీకి డిగ్రీ కళాశాలగా అనుమతి ఇవ్వడం మరువలేదన్నారు. స్థానికుడికి అవకాశం వచ్చిందని, పెద్దాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. «ఎందుకు ఆంధ్రకు జగన్ కావాలి» అనే అంశంపై వీడియో ప్రదర్శన చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహించగా, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, మండల కన్వీనర్ ఉటా వాసు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ మడికి మేరీసోనియా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, పాగా సురేష్‌కుమార్, ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

పెద్దాపురం: సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో మెరుగైన ప్రజా సంక్షేమ పాలన జరుగుతోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్; వైస్ ఎంపీపీ మిరియాల రాజా, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. మెరుగైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని వీరు కోరారు. కార్యక్రమానికి సర్పంచ్ ఆకుల వరలక్ష్మి అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ ముందెన్నడూ లేని విధంగా గాంధీజీ కలలను సాకారం చేస్తూ, సచివాలయాలను స్థాపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతులకు నేరుగా సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టారన్నారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీదేవి, ఏఓ సంజయ్‌కుమార్, కాండ్రకోట పీఏసీఎస్ అధ్యక్షుడు పల్ల గంగరావు, సర్పంచ్‌లు కనపర్తి సీమదొర, శ్రీనివాస్, ఒబిలిశెట్టి అబ్బాయి, ఆకుల వీరబాబు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, వట్టికూటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతల మధ్య కుమ్ములాట

• పిఠాపురం జనసేన నేత స్థానికేతరుడని మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శ
• బిల్డప్ బాబాయ్ అంటూ వర్మపై జనసేన నేతల సెటైర్లు
• తారా స్థాయికి చేరిన వివాదం

పిఠాపురం: టీడీపీ–జనసేన ఎన్నికల మైత్రి పిఠాపురంలో పొసగడం లేదు. తాజాగా పరస్పర విమర్శలతో కుమ్ములాటకు దిగారు. తప్పుడు మెసేజ్ పెట్టి జనసేన కార్యకర్త కేసులో ఇరుక్కున్న సంఘటన రెండు పార్టీల శ్రేణుల మధ్య వివాదం రాజేసింది. నిరాధార ఆరోపణలతో మెసేజ్ పెట్టిన జనసేన కార్యకర్తను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న జనసేన నేతలు విడిపించే ప్రయత్నాలు చేశారు. ఇంతలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో మంతనాలు జరిపారు. అప్పటికే జనసేన కార్యకర్తను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చాక వర్మ మీడియాతో మాట్లాడుతూ జనసేన కార్యకర్తను తాను విడుదల చేయించానన్నారు. జనసేన ఇన్‌చార్జ్ హైదరాబాద్‌లో ఉంటారన్నారు. ఆ పార్టీ కార్యకర్తలకు కష్టం వస్తే రక్షించే వారు లేరని అందుకే తాను రంగంలోకి దిగానని జనసేన పిఠాపురం ఇన్ చార్జ్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఉద్దేశించి విమర్శ చేశారు. ఈ మాటలు రెండు పార్టీల మధ్య అగ్గి రాజేశాయి.

బిల్డప్ బాబాయ్ అంటు సెటైర్లు

జనసేన కార్యకర్తను తాను కాపాడని మాజీ ఎమ్మెల్యే వర్మ పిఠాపురం ఇన్‌చార్జ్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఉద్దేశించి విమర్శలు చేయడంపై జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ తీవ్రంగా మండిపడ్డారు. పిఠాపురం మండలం భోగాపురంలో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన వర్మపై సెటైర్లు వేశారు. జనసేన కార్యకర్తను పోలీసులు అరెస్టు చేస్తే విడిపించడానికి ఉదయ్ శ్రీనివాస్ అనివార్య కారణాల వల్ల రాలేక పోయారని చెప్పుకొచ్చారు. అయినప్పటికీ అంతా తానే చేశానంటూ బిల్డప్ ఇస్తున్నారని వర్మను ఉద్దేశించి విమర్శించారు. దీంతో వర్మ జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ టీడీపీ నేతలు సోషల్ మీడియాలో ప్రచారానికి తెరలేపారు. దీంతో పిఠాపురంలో రెండు పార్టీ మధ్య కుమ్ములాటలు తారా స్థాయికి చేరుకున్నాయి.